## క్లుప్తంగా

### ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాబ్జిరాజు

**మొగల్తూరు:** సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ వొంగ్రు బాబ్జిరాజు ఆదేశించారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా ఏర్పాటు చేసిన సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను, ప్రభుత్వ లబ్ధి పొందుతున్న అర్హుల వివరాలను సచివాలయ నోటీస్ బోర్డుల్లో కచ్చితంగా ఉంచాలన్నారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవల వివరాలను కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి అబ్దుల్ రెహ్మాన్, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### నేటితో ముగియనున్న వేసవి శిక్షణ తరగతులు



డ్యాన్స్‌లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

**నరసాపురం:** స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ముగింపు దశకు చేరాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతీరోజూ దినపత్రికలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. యోగాలో శిక్షణ ఇచ్చారు.

### గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

**పాలకొల్లు అర్బన్:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన సంతానం కలుగుతారని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ ప్రభాకరరావు అన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సమృద్ధి యోజన పథకంలో నమోదైన గర్భిణులకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు విరాళంతో శుక్రవారం 38 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, లయన్స్ క్లబ్ సీనియర్ మెంబర్ ఎస్ఏ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### పేద రోగులకు ఫ్యామిలీ ఫిజిషియన్ వరం

**పాలకొల్లు అర్బన్:** పేద రోగులకు ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరం వరమని డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మండలంలోని శివదేవుని చిక్కాల సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపీ, షుగర్, గుండె, ఇతర రోగ పీడితులను పరీక్షించి వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల మణివజ్రం, ఆరోగ్య విస్తరణాధికారి కె ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ అమశేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ పి సుజిత, జీవీ ప్రశాంతి, కె సుశీల, కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 202 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

**పాలకొల్లు సెంట్రల్:** ప్రతి ఉద్యోగి ఏ ప్రాంతంలోనైనా ఉద్యోగం చేయగలిగే ఆత్మ స్థైర్యం కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 12 సంస్థలు పాల్గొనగా 441 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 202 మంది వివిధ కంపెనీల్లో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, ఎల్ఐసీ మేనేజర్ రఘు, ఎడీఎస్‌డీఓ ఆంజనేయులు, జిల్లా ఉపాధి అధికారి మధుభూషణ్‌రావు, కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

# బీమాతో పశు పోషకులకు ధీమా



కాపవరంలో రైతు పోషిస్తున్న పాడి గేదెల మంద



పాడి పశువుకి ఇన్సూరెన్స్ ట్యాగ్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది

- జూన్ 1 నుంచి అమలవుతున్న పశుబీమా
- ఐదు గేదెలు/ఆవులు, 50 గొర్రెలు/మేకలు/పందులకు వర్తింపు

**పాలకొల్లు అర్బన్:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశు పోషకులకు ధీమా వచ్చింది. ప్రభుత్వం వైఎస్సార్ బీమా సౌకర్యాన్ని ఈ ఏడాది జూన్ 1 నుంచి అమలు చేయడంతో పాడి రైతులకు ఎంతో ఉత్సాహం వచ్చింది. గతంలో వైఎస్సార్ పశు నష్ట పరిహారం స్థానంలో కొత్తగా ఈ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. పాము కరచి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్నిప్రమాదాలు, లేదా వాహనాలు ఢీకొని పాడి పశువులు చనిపోతే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించేది. అదికూడా అనేక రకాలుగా విచారణ జరిపి నష్ట పరిహారం పొందడానికి రైతులకు జునెలల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది.

**బీమాతో రైతులకు లబ్ధి**

పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందులు పెంపకందారులకు పశు బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో లబ్ధిదారుల వాటాగా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20శాతం, ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం నిర్ణయించారు. ఈ పథకంలో గరిష్ఠంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు/మేకలు/పందులకు పశు బీమా పొందడానికి అవకాశం కల్పించింది.

**బీమా వివరాలు ఇవే**

రూ.3 వేలు విలువైన ఆవు లేదా గేదెలకు బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మూడేళ్ల కాల పరిమితికి రూ.384లు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి. అలాగే ఏపీఎల్ లబ్ధిదారులకు రూ.980లు చెల్లించాలి. అలాగే రూ.15 వేలు విలువైన ఆవు, గేదెలకు బీపీఎల్, ఎస్సీ, ఎస్టీలకు రూ.192, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.480 చెల్లించాలి. రూ. 6 వేలు విలువైన గొర్రె, మేకలకు ఒక ఏడాదికి బీపీఎల్, ఎస్సీ, ఎస్టీలకు రూ.36, ఏపీఎల్ లబ్ధిదారులకు రూ.90, అలాగే రెండేళ్లకు ఎస్సీ, ఎస్టీలకు, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.54, ఏపీఎల్ లబ్ధిదారులకు రూ.135, అలాగే మూడేళ్లకు ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు రూ.75, ఏపీఎల్ లబ్ధిదారులకు రూ.187.50 చెల్లించాలి.

**రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు...**

పాడి పశువులకు ఇన్సూరెన్స్ ఫారాలను అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న వెటర్నరీ అసిస్టెంట్‌లు, దగ్గులూరు, వెంకటాపురంలోని పశు ఆసుపత్రుల నమోదు చేస్తారు.

### పాడి రైతులకు ఎంతో మేలు



ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకం పశు పోషకులకు ఎంతో మేలు. చాలా మంది రైతులు ఖరీదైన ఆవులు, గేదెలను పోషిస్తున్నారు. వీటి విలువ లక్షల్లో ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగితే రైతు నష్టపోతున్నారు. ఈ పథకం వల్ల రైతులకు ఎంతో ఉపయోగం. ప్రతీ ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– డా. వరప్రసాద్, పశువైద్యాధికారి, దగ్గులూరు

### 20 పొట్టేళ్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం



నేను డ్వాక్రా పథకంలో సుమారు లక్ష రూపాయలు రుణం తీసుకున్నాను. నాకు 20 పొట్టేళ్ల ప్రభుత్వం ఇచ్చింది. వీటికి ఇన్సూరెన్స్ కూడా ప్రభుత్వం చేయించడం వల్ల నాకు ఎంతో ప్రయోజనం చేకూరింది. నా రుణం తాలూకు సొమ్ములతో ఇన్సూరెన్స్ చేయించుకున్నా. నాకు చాలా ధీమా వచ్చింది. గొర్రెలు ఏదైనా జబ్బు చేసి చనిపోయినా నాకు ఇన్సూరెన్స్ వస్తుందనే నమ్మకం వచ్చింది.

– బొండాడ లక్ష్మి, కొత్తపేట

### గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నరసాపురం రూరల్:** మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సీహెచ్ కె.శైలజ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తుల కోసం ఆయా గురుకుల పాఠశాలల కార్యాలయ పని వేళల్లో ఈ నెల 10 నుంచి 17 లోపు ఉచితంగా పొందవచ్చన్నారు. 19న ఉదయం 11గంటలకు ఆయా పాఠశాలల వద్ద ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు నరసాపురం (బాలికలు 98665 59627, నరసాపురం (బాలురు)- 91916 15923, పాలకొల్లు (బాలురు)- 89193 12768, పెనుగొండ (బాలురు)- 90322 31750, తాడేపల్లిగుడెం (బాలురు)- 63035 20949 నెంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు.

### ఖాతాదారులకు మెరుగైన సేవలు

**భీమవరం అర్బన్:** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయడమే యూనియన్ బ్యాంకు లక్ష్యమని యూనియన్ బ్యాంకు భీమవరం రీజనల్ హెడ్ పి. సంగీత కుమారి అన్నారు. భీమవరంలోని డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు.

# లాభసాటి వ్యవసాయమే సీఎం జగన్ లక్ష్యం

**పెనుగొండ:** రాష్ట్రంలో రైతులకు అండగా నిలిచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలో ఆచంట మండలం పెనుమంచిలి గ్రామానికి చెందిన రైతులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. తండ్రి వైఎస్సార్ బాటలో సీఎం జగన్ రైతుల సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. వినూత్న రీతిలో రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించి రైతులకు అవసరమైనా సాంకేతిక, శాస్త్రీయ సహకారం అందిస్తున్నారన్నారు. సాగులో ఆధునిక యంత్రాలతో సాగు ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచడానికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. రైతు భరోసా, బీమా వంటి సంక్షేమ పథకాలు అమలుతో పాటు, సబ్సీడీపై యంత్రాలను అందిస్తున్నారన్నారు. జేఏసీ గ్రూపులు ఏర్పాటు వారికి యంత్రాలను అందిస్తున్నారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పెనుమంచిలి సర్పంచ్ గణేశుల శేషువాణి సుబ్బారావు, బుర్రా రవికుమార్, ఉప సర్పంచ్ బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు కోళ్ల గోవిందరావు, ఏలేటి రాంబాబు, పేర్రాజు, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పోడూరు ఎంపీడీవోగా సుహాసిని**

పోడూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన డి.సుహాసిని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును తూర్పుపాలెంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అదేవిధంగా పేదలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ డైరెక్టరు పోతుమూడి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**పౌష్టికాహార కిట్ల అందజేత**



తూర్పుపాలెంలో పవర్ టిల్లర్లను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



మార్టేరులో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

**పెనుమంట్ర:** ఎన్ని కష్టాలు ఎదురైనా ఓర్పు, సహనంతో జీవించేది తల్లి మాత్రమేనని ఆమెకు సమాజంలో గౌరవమైన స్థానం ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం మార్టేరులోని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షమాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, సర్పంచ్ మట్టాకుమారి ఏర్పాటు చేసిన మదర్‌థెరిస్సా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పూర్వం గర్భిణులు, బాలింతలు ఉన్న ఇళ్లల్లో కుటుంబికులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వం వైద్యసేవలను గ్రామీణ ప్రాంతాల్లోకి అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా వైద్యులు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలకు కూడా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. అనంతరం వంద మందికి పైగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ ఉపాధ్యక్షురాలు ఈది అనిత, ఉప సర్పంచ్ కర్రివేణుబాబు, మార్టేరు, నెగ్గిపూడి ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రిఅనురాధ, పెనుగొండ లక్ష్మి, సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చురుగ్గా కాలువ రిటైనింగ్‌వాల్ పనులు



సారవగ్రామంలో పంట కాలువలకు రిటైనింగ్‌వాల్‌ను నిర్మిస్తున్న దృశ్యం

**నరసాపురం రూరల్:** సార్వా సాగుకు శివారు ప్రాంతాకు సైతం నీరు అందే విధంగా చేపట్టిన కాలువల ప్రక్షాళన పనులు పూర్తికావచ్చాయి. దీనికి తోడు గ్రామాల్లో అంతర్గత పంట కాలువలను సైతం ఉపాధి హామీ పనుల్లో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. నరసాపురం మండలంలోని సారవ గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంటకాలువకు రిటైనింగ్‌వాల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అయితే పంచాయతీ నిధులు వెచ్చించి ఈ ప్రాంతంలో కాలువ వద్ద చేపట్టిన రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నరసాపురం ప్రధా నకాలువలో నీరు రావడంతో రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా శివారు ప్రాంతాలకు నీరందించే శేషావతారం ఛానల్‌కు అనుకుని ఉన్న సబ్ ఛానల్ పూడికతీత పనులు కూడా చేశారు. సారవ గ్రామ పరిధిలోని గొల్లలకొడప వద్ద ఈ సబ్ ఛానల్‌కు సంబంధించిన రిటైనింగ్‌వాల్ నిర్మాణం పూర్తి చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



తూర్పుపాలెంలో వెంకన్న కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**పోడూరు:** మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మేడిచర్ల వెంకట నాగ పాండురంగరావు, పద్మావతి దంపతుల చేతులమీదుగా ఆలయ అర్చకులు రాంపల్లి జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళ వాయిద్యాలు, బాణసంచా సందడితో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మేడిచర్ల పండు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**కాళ్ల:** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కాళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గులాబ్‌రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కాళ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానికులతో డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇళ్లల్లో వాడే కుండీల్లో నీటిని రెండు రోజులకోసారి మార్చాలన్నారు. ఎక్కువ రోజులు నిలువ ఉంచకూడదని ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులను ఇళ్ల పరిసరాల్లో ఉంచకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవడమే ఎమ్మెల్యే నిమ్మల పని



విలేకరులతో మాట్లాడుతున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ

**పాలకొల్లు అర్బన్:** నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు లక్ష్యమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే నిమ్మల ఏడుపు ఉంటుందన్నారు. ఇటీవల సగంచెరువు బ్రిడ్జి వంతెన ప్రారంభోత్సవంలోనూ, అలాగే టిడ్కో గృహాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నిమ్మల చేసిన డ్రామాలన్నీ ప్రజలకు తెలుసన్నారు. చించినాడలో దళితుల పక్షాన పోరాటం చేస్తున్నట్లు నాటకం ఆడుతున్నారన్నారు. ప్రభుత్వానికి చెందిన పెరుగులంక భూముల్లోని తువ్వ ఇసుకను తరలిస్తుంటే అడ్డుపడడం సిగ్గుచేటన్నారు. పెరుగులంక భూములు ఎవరికి చెందుతాయో తెలుసుకోకుండా తానొక విద్యావంతుడిని అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మరో వారం రోజులు ఆగితే వర్షాలు వస్తాయి కాబట్టి ఈ పనులు జరగకుండా అడ్డుకుంటే జగనన్న కాలనీ పనులు ఆగిపోతాయని కుట్ర ఆలోచనలో ఎమ్మెల్యే నిమ్మల పనిచేస్తున్నారని తాతాజీ దుయ్యబట్టారు. విలేకరుల సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, కోట రత్నంరాజు, జోగి వెంకటేశ్వరరావు, పీటర్‌సన్ చిన్ని, పితాని మురళి, ఉప్పె పండుబాబు, నక్కా చిత్తరంజన్‌దాస్, పిట్టా రాజ్‌కుమార్, శిడగం రమణ పాల్గొన్నారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

**సాక్షి, భీమవరం:** విద్యార్థులు ఉత్తమ లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలని దీనికి గానూ తల్లిదండ్రులతో చర్చిస్తే మంచి ప్రయోజనం ఉంటుందని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, స్ట్రాటజిక్ ప్లానింగ్ పై నిర్వహించే వర్క్ షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఉత్తీర్ణత తరువాత విద్యార్థులకు కొంత స్వేచ్ఛ లభిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్ ఉంటుందన్నారు. ఉన్నత చదువులలో విద్యార్థులు స్వయం కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలనే ఆలోచనలతో ముందుకు సాగినప్పుడే విజయాలను అందిపుచ్చుకోగలరన్నారు. ఈసీఈ హెడ్ ఎస్.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో నైపుణ్యానికే ప్రాధాన్యత ఉంటుందితప్ప ప్రత్యేక కోర్సుల్లోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలమనే విద్యార్థుల భావన సరైనది కాదన్నారు. శాటిలైట్ ప్రయోగిస్తే అందులో అన్ని ఇంజినీరింగ్ విభాగాలు సమిష్టిగా కలిసి పని చేస్తేనే ఆ ప్రయోగం విజయవంతం అవుతుంది తప్ప ఏ ఒక్క బ్రాంచ్ ప్రత్యేకం కాదని విద్యార్థులు గమనించాలన్నారు. ఇంజినీరింగ్‌లో చేరే వరకు మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ వంటి కోర్ గ్రూప్ సబ్జెక్టులపై నిరంతరం సాధన చేయాలని సూచించారు.

## ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

**ఆకివీడు:** రబీ సాగును విజయవంతంగా పూర్తి చేసిన రైతన్నలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఖరీఫ్ సాగుకు సన్నద్ధులు కావాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రబీ సాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించారని చెప్పారు. ఖరీఫ్ సాగుకు సకాలంలో నీటి సరఫరా చేస్తున్నందున రైతులు ముందస్తు సాగుకు సిద్ధం కావాలన్నారు. ఎంటీయూ 1318 వంగడం 155 రోజుల పంటను సాగు చేస్తుండటంతో త్వరితగతిన సాగు చేసుకోవాలన్నారు. అలస్యంగా సాగు ఆలస్యం అయితే ఎంటీయూ 1064,1061లను సాగు చేసుకోవాలన్నారు. పశువైద్యురాలు భార్గవీ మాట్లాడుతూ పశు బీమా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. సమావేశానికి హాజరుకాని నీటిపారుదల శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు తీర్మానం చేశారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కందుల వాణి, ఏఓ ఎమ్మార్సీ ప్రియాంక పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



22వ వార్డులో రూ.18లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

**పాలకొల్లు అర్బన్:** రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు పట్టణంలోని పలు వార్డులో సుమారు రూ.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, పైపులైన్ విస్తరణ పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అయితే ప్రతిపక్ష ఎమ్మెల్యే నిమ్మల నిజాలను కూడా అబద్ధాలు చేయగల ఘనుడన్నారు.

**ఎమ్మెల్యే నిమ్మల తప్పిదం వల్లే టిడ్కో గృహాలు ఆలస్యం**

పట్టణ శివారులోని పెంకుళ్లపాడులో నిర్మించిన టిడ్కో గృహాలు లబ్ధిదారులకు చేరడంలో ఎమ్మెల్యే నిమ్మల చేసిన తప్పిదం వల్లే లబ్ధిదారులకు ప్లాట్‌లు అప్పగించడంలో జాప్యం జరుగుతోందన్నారు. పలువురు లబ్ధిదారులు టిడ్కో గృహాలు తక్షణం అప్పగించాలని కోరడంతో ఆయన సమాధానం చెప్పారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం టిడ్కో గృహాలు పూర్తికాకుండానే గృహ ప్రవేశాలు చేయించారని దుయ్యబట్టారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు పూర్తికాకుండా, అలాగే ఒక్కొక్క లబ్ధిదారుని 20 ఏళ్ల పాటు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణ పత్రాలు ఇచ్చి మోసం చేశారని ఎమ్మెల్యే నిమ్మల తీరును గుర్తు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రూ.6 లక్షల పనులకు శంకుస్థాపనలు...**

పట్టణంలోని 22వ వార్డులో రూ.18 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, అలాగే 27వ వార్డులో రూ.27 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 3వ వార్డులో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతోపాటు రూ.7.60 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డుపనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, మామిడి బాబు, నంబూరు గంగా పవన్, జోగి వెంకటేశ్వరరావు, వార్డు ఇన్‌చార్జ్‌లు పిల్లా శ్రీనివాస్, ఉప్పే పండుబాబు, ఇజ్జాడ చినబాబు, యలకల రంగ, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.